క్లుప్తంగా

విద్యార్థులకు కంటి పరీక్షలు



కలిగిరి: స్థానిక ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు జలదంకి పీహెచ్‌సీ నేత్ర వైద్యనిపుణుడు కే వెంకటసుబ్బయ్య గురువారం కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం కలిగిన 38 మందికి కంటి అద్దాలు అందజేశారు. ప్రిన్సిపల్ అన్నవరపు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ వార్షికోత్సవం



కలిగిరి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కప్పా నారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ శారు. వైద్యాధికారిణి బిజ్జం గీతారెడ్డి, వింజమూరు తాలుకా అధ్యక్షుడు చెంచురామయ్య, తిరుపతిరావు, సాయిలక్ష్మి, సక్కుభాయి, దొరసానమ్మ, సరోజని, సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడులు

సంగం: సంగంలోని రేషన్‌షాపులపై విజిలెన్స్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. రెండో నంబరు రేషన్ షాపులో 300 కిలోల రేషన్ బియ్యం, 46 ప్యాకెట్లు చక్కెర తక్కువగా ఉండడాన్ని గుర్తించి 6ఏ కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సీఐ సుభాన్, ఆర్ఐ సల్మా పాల్గొన్నారు.

వెంగమాంబకు పల్లకిసేవ



దుత్తలూరు: నర్రవాడలోని వెంగమాంబ పేరంటాలు ఆలయంలో వెంగమాంబ, గురవయ్య దంపతులకు పల్లకిసేవను గురువారం వైభవంగా నిర్వహించారు. తొలుత విశేషాభిషేకాలు, చందనాలంకారం, కుంకుమార్చన నిర్వహించారు.

కాలువలోకి దూసుకెళ్లిన కారు

సంగం: కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన ఘటన మండలంలోని దువ్వూరు వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ఓ వ్యక్తి కారులో ఏఎస్‌పేటకు వెళ్లి తిరిగి వస్తుండగా దువ్వూరు వద్ద ఒక్కసారిగా రోడ్డుకు అడ్డంగా గేదె వచ్చింది. దానిని తప్పించబోయే క్రమంలో కారు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లింది. కాగా కారులోకి వ్యక్తికి ఎలాంటి గాయాలు కాలేదు.

సోషల్‌ఆడిట్‌ను పారదర్శకంగా చేపట్టాలి

సీతారామపురం: సామాజిక తనిఖీ బృంద సభ్యులు గ్రామాల్లో నిర్వహించే సోషల్ ఆడిట్‌ను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ భాస్కర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోషల్ ఆడిట్ బృంద సభ్యులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. 1.4.2023 నుంచి 31.03.2024 వరకు మండలంలోని 14 పంచాయతీల్లో రూ.8,35,69,875 వ్యయంతో ఉపాధి పనులు నిర్వహించారని తెలిపారు. ఈ పనులపై సోషల్ ఆడిట్ జరుగుతున్నందున ఫీల్డ్ అసిస్టెంట్లు సహకరించాలని కోరారు. ఎస్సార్పీ నీలకంఠ, ఈఓపీఆర్డీ భార్గవి, ఏపీఓ సుభాషిణి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం



కలిగిరి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం సమీపంలో ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలు నాటకరాణి రమణమ్మకు చెందిన పూరింట్లో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. రమణమ్మ వంట చేసుకుని పక్క ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో ప్రమాదవశాత్తు ఇంటికి మంటలు అంటుకున్నాయి. స్థానికుల సమాచారంతో వింజమూరు అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. ఈ ఘటనలో రమణమ్మ దాచుకున్న రూ.20వేల నగదు, గృహోపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. రమణమ్మ కట్టుబట్టలతో మిగిలింది.

పారిశుధ్యం నిర్వహణపై శిక్షణ

ఆత్మకూరురూరల్: మండలంలోని ఎల్‌టీసీ కేంద్రంలో పారిశుధ్యం నిర్వహణపై గ్రీన్‌అంబాసిడర్లు, గ్రీన్‌కార్డులకు గురువారం ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. మాస్టర్ ట్రెయినర్ కృష్ణ ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తసేకరణ, సంపద కేంద్రాలకు తరలించి వేరు చేయడం, తడి చెత్తను వర్మికంపోస్టుగా మార్చడం,తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేవతి, ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఈఓపీఆర్డీ డేవిడ్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో విలీన గుబులు



అయ్యవారిపల్లి పాఠశాల ఎదుట విలీనాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు(ఫైల్)



సీతారామపురం ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న తల్లిదండ్రులు(ఫైల్)

- ప్రభుత్వ బడులపై సర్కారు పిడుగు
- సంస్కరణల పేరుతో పాఠశాలల విలీనానికి ప్రతిపాదనలు
- వ్యతిరేకిస్తున్న తల్లిదండ్రులు
- డ్రాపౌట్స్ పెరిగే అవకాశం ఉందని ఆందోళన

సీతారామపురం: సర్కారు బడులపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. ప్రభుత్వ బడులను అభివృద్ధి చేయాల్సింది పోయి కార్పొరేట్ బడులకు మేలు చేకూర్చే విధంగా అసంబద్ధ నిర్ణయాలు తీసుకుంటూ కత్తి దూస్తోంది. 3,4,5 తరగతుల విలీనానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తుండడం చిన్నారుల్లో గుబులు రేపుతోంది. నూతన విద్యావిధానం పేరుతో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను తగ్గించేందుకు ప్రతిపాదనలు చేయడాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు వ్యతిరేకిస్తున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలు చేపడుతున్నారు. పాఠశాలల విలీన ప్రక్రియను ఎట్టి పరిస్థితుల్లోనూ తాము అంగీకరించబోమని స్పష్టం చేస్తున్నారు.

తెరపైకి కొత్త విధానం

కూటమి ప్రభుత్వం సవ్యంగా సాగుతున్న విద్యావ్యవస్థను అడ్డగోలు ప్రయోగాలతో అభాసుపాల్జేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం విద్యావ్యవస్థను బలోపేతం చేస్తున్నామని చెబుతూ పలు కొత్త విధానాలను తెరపైకి తెచ్చింది. అందులో భాగంగా ఫౌండేషన్, బేసిక్, మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నామంటూ చెబుతోంది. కొత్త విధానంలో ప్రతి పంచాయతీ పరిధిలో ఒక ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేసి ఆ పంచాయతీ పరిధిలోని మిగిలిన ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను అందులో విలీనం చేయనున్నారు. అరవై మందిలోపు విద్యార్థులుంటే బేసిక్ ప్రైమరీ పాఠశాలగా, 2వ తరగతి వరకు మిగిలిపోయిన పాఠశాలలను ఫౌండేషన్ పాఠశాలలుగా, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 6,7,8 తరగతులను ఐదు కిలోమీటర్ల పరిధిలో ఉండే ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయనున్నారు. అయితే ఈ విధానానికి క్షేత్రస్థాయిలో పరిస్థితులు తగినట్లుగా లేవని కొన్ని పాఠశాలల పరిస్థితిని పరిశీలిస్తే అవగతమవుతోంది. సీతారామపురం మండలంలోని నారాయణప్పపేట, నూతివారికొట్టాలు, సంగసానిపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లోని 3,4,5 తరగతులను సీతారామపురంలోని బెస్తకాలనీ పాఠశాలలో విలీనం చేయాలని ప్రతిపాదించారు. అలాగే అయ్యవారిపల్లి ఎస్సీ కాలనీ, మెయిన్, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని 3,4,5 తరగతులను పోలంగారిపల్లి పాఠశాలలో విలీనం చేయాలని నిర్ణయించారు. అలాగే తురకపాళెం, సీతారామపురం వెస్ట్ జెడ్పీ హైస్కూల్‌లోని 3,4,5 తరగతులను కోటవీధి పాఠశాలలో, ఏసీనగర్, ఎస్‌నగర్‌లోని పాఠశాలలను బసినేనిపల్లి పాఠశాలలో విలీనం చేయాలని అధికారులు ప్రతిపాదించారు.ఈ పాఠశాలల పరిధిలోని విద్యార్థుల తల్లిదండ్రులు ఇప్పటికే మండల విద్యావనరుల కేంద్రానికి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఇలా నియోజకవర్గ వ్యాప్తంగా తరగతుల విలీనాలకు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

ఉదయగిరి నియోజకవర్గంలో పాఠశాలల విలీన ప్రతిపాదనలు

మండలం	ఫౌండేషన్	బేసిక్ ప్రైమరీ	మోడల్ ప్రైమరీ	యూపీ	ఉన్నత
సీతారామపురం	17	11	6	0	4
ఉదయగిరి	28	8	14	1	9
దుత్తలూరు	25	10	9	0	6
వరికుంటపాడు	29	5	16	0	8
వింజమూరు	14	16	12	0	6
కలిగిరి	29	20	13	3	5
కొండాపురం	29	12	14	0	9
జలదంకి	11	21	12	5	5



విలీన ప్రక్రియపై పునరాలోచించాలి



అయ్యవారిపల్లి పాఠశాలలోని 3,4,5 తరగతులను పోలంగారిపల్లిలో విలీనం చేస్తామని చెబుతున్నారు. ఇలా చేస్తే విద్యార్థులు అంతదూరం జాతీయ రహదారిని దాటుకుని బ్యాగులు మోసుకుంటూ వెళ్లి చదవడం కష్టతరం. విలీన ప్రక్రియపై అధికారులు పునరాలోచించాలి.

– పూజ, ఎస్ఎంసీ చైర్మన్, అయ్యవారిపల్లి పాఠశాల

ఆందోళనలు తప్పవు



తరగతుల విలీన ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి. లేని పక్షంలో ఆందోళనలు ఉద్ధృతం చేస్తాం. ప్రభుత్వం విలీన ప్రక్రియ చేపట్టి దూరప్రాంత విద్యార్థులకు రవాణా చార్జీలు ఇచ్చి చేతులు దులుపుకోవాలని భావిస్తోంది. ఈ ప్రక్రియ విద్యార్థులకు చాలా నష్టం చేకూరుస్తుంది.

– రఘురాములు, ఎస్ఎంసీ సభ్యుడు, నారాయణప్పపేట

డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం



సవ్యంగా నడుస్తున్న పాఠశాలల్లోని 3,4,5 తరగతులను సమీప గ్రామాల్లోని పాఠశాలల్లో విలీనం చేసి పూరిస్థాయిలో సబ్జెక్ట్ టీచర్లను నియమించి బోధన చేస్తామని చెప్పడం సరికాదు. ఇలా చేయడం వల్ల సుదూరంగా ఉన్న పాఠశాలలకు వెళ్లేందుకు ఇష్టం లేక విద్యార్థులు బడి మానేసే అవకాశం ఉంది. అన్ని చోట్ల ఖచ్చితంగా డ్రాపౌట్స్ పెరిగే ప్రమాదం ఉంది.

– బొగ్గవరపు రత్నం, ఎన్జీఓ

నాణ్యమైన విద్యకు అవకాశం



నూతన విద్యావిధానంలో తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లోని 3,4,5 తరగతులను పంచాయతీ పరిధిలోని ఒకే పాఠశాలలో విలీనం చేయనున్నాం. అక్కడ అన్ని సబ్జెక్టుల ఉపాధ్యాయులను నియమించి బోధన చేస్తాం. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందేందుకు అవకాశం ఏర్పడుతుంది. తల్లిదండ్రులు అర్థం చేసుకుని ప్రోత్సహించాలి.

– ఎంవీ జానకిరాం, ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఈఓ ,ఆత్మకూరు డివిజన్

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



మాంగళ్యాలను చూపుతున్న అర్చకులు



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

సంగం: స్థానిక కామాక్షీదేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యస్వామి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం రాత్రి నేత్రపర్వంగా నిర్వహించారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి అత్యంత వైభవంగా నిర్వహించారు. సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి కల్యాణ మండపంపై కొలువుతీర్చి సంప్రదాయబద్ధంగా కల్యాణం జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో సరస్వతి పూజ



మైక్‌సెట్‌ను బహూకరించిన విశ్రాంత హెచ్ఎం సత్యనారాయణ



ఆత్మకూరులో సరస్వతి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

కలిగిరి: కుమ్మరకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సరస్వతి పూజను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత హెచ్ఎం షరాబు సత్యనారాయణ మైక్‌సెట్‌ను బహూకరించారు. హిందీ సబ్జెక్ట్‌లో 90 మార్కులకుపైగా సాధించిన ప్రతివిద్యార్థికి రూ.1,500 చొప్పున నగదు బహుమతి అందజేస్తానని హిందీ పండిట్ సోమిశెట్టి మాధవీలత ప్రకటించారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ఉమామహేశ్వరశర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులు సరస్వతి పూజను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత డీసీపల్లికి చెందిన కన్నమనేని నాగేశ్వరరావు బహూకరించిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. దివంగత డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి కుమార్తె దేవిరెడ్డి మైథిలి, నాగరాజారెడ్డి దంపతుల సౌజన్యంతో నిర్మించిన రేకుల షెడ్డును ప్రారంభించారు. దాతలకు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఉపాధ్యాయులు కోరారు.

ప్రసన్నుని సాక్షిగా అసత్యాలతో అపచారం



2024 ఫిబ్రవరి 19న ఆవిష్కరించిన శిలాఫలకంలో ప్రారంభకులుగా ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్‌రెడ్డి పేరు



ఎమ్మెల్యే దగుమాటి ప్రారంభించినట్లుగా కొత్తగా ఏర్పాటు చేసిన శిలాఫలకం

కావలి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి సాక్షిగా దేవాదాయశాఖ అధికారులు అసత్యాలతో అపచారానికి పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సత్యనిష్టకు, ధర్మరక్షణకు వేదికగా నిలిచే స్వామివారి సన్నిధిలో తప్పుడు వివరాలతో ఇష్టారాజ్యంగా శిలాఫలకాలు మార్చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఆలయంలో ఈవో తమ్ముడి పెత్తనం కారణంగా భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాజాగా శిలఫలకాలను సైతం మార్చేస్తున్నారని ఆరోపించారు. ఆలయ ప్రాంగణంలో బచ్చు అమరా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన అన్నదాన, కార్యాలయ భవనాలను 2024 ఫిబ్రవరి 19వ తేదీన అప్పటి కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు కూడా హాజరయ్యారని తెలిపారు. ఇందుకు సంబంధించిన శిలాఫలకాలను ఆలయ ఈఓ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత తొలగించి ప్రస్తుత ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ప్రారంభించినట్లుగా కొత్తవి ఏర్పాటు చేయడం దారుణమని మండిపడ్డారు. భవనాలను ప్రారంభించినప్పటికి ఎన్నికలు జరగకపోయిన ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ప్రారంభోత్సవం చేసినట్లుగా ఆలయ ఈఓ శిలాఫలకాలు ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఆలయ పవిత్రతను, భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇటువంటి పనులను మానుకోవాలని ఈఓకు హితవు పలికారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన



వింజమూరు(ఉదయగిరి): రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపడుతున్న ఆందోళన కార్యక్రమంలో భాగంగా వింజమూరులోని విద్యావనరుల కేంద్రం ఎదుట ఉద్యోగులు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచాలని, హెచ్ఆర్ పాలసీని అమలు చేసి రిటైర్‌మెంట్ గ్రాట్యూటీని అందించాలని డిమాండ్ చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



అల్లూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి అన్నారు. ఇందుపూరు పల్లిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళా చదువుకుని సమాజాభివృద్ధికి తోడ్పడాలన్నారు. పిల్లలను బాగా చదివించి వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దాలన్నారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, అంగన్‌వాడీ సుభాషిణి పాల్గొన్నారు.

చోరీ కేసులో ముమ్మర దర్యాప్తు

ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేటలో విశ్రాంత ప్రిన్సిపల్ కే వెంకటసుబ్బయ్య ఇంట్లో మంగళవారం అర్ధరాత్రి జరిగిన చోరీ ఘటనపై పోలీసులు ముమ్మర దర్యాప్తు చేపడుతున్నారు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్న వెంకటసుబ్బయ్య కుమారుడు రామకృష్ణ సీఐ గంగాధర్, ఎస్సై జిలానీకు గురువారం సీసీపుటేజీని అందజేయగా వారు ఇంటి పరిసరాలను పరిశీలించారు. సీసీపుటేజీని క్షుణ్ణంగా పరిశీలించి దర్యాప్తు చేసి చోరీ కేసును ఛేదించనున్నట్లు వారు తెలిపారు.

ఏబీఎం ఆస్తులపై అసత్య ప్రచారాలు చేస్తే చర్యలు

ఉదయగిరి: పట్టణంలోని స్టేట్‌పేటలో ఉన్న ఏబీఎం ఆస్తులపై అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్టీబీసీ, పీఏబీసీ లా అధికారి కాకి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ఏబీఎం చర్చి ఆవరణలో పాస్టర్లు, సంఘ పెద్దలతో కలిసి గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మద్రాస్ హైకోర్టు క్రిస్టియన్ ఆస్తులపై ఓ కమిటీని నియమించాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ కమిటీ నియామకం ఇంకా జరగలేదన్నారు. కమిటీ ఆస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అందజేసే నివేదిక ఆధారంగా కోర్టు తీర్పు ఇవ్వడం జరుగుతుందన్నారు. కాగా కొందరు గ్రూపులుగా ఏర్పడి ఏబీఎం ఆస్తులు తమవని, విక్రయిస్తామని అసత్య ప్రచారాలు చేయడం సరికాదన్నారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సంఘపెద్దలు ఆనందరావు, ఆరోన్, కే ప్రసాద్, జాషువా, ఇమ్మానుయేలు సంఘసభ్యులు, పాస్టర్లు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



కొనుగోలు కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ పావని

ఉదయగిరి: ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కొనుగోలు కేంద్రాల సిబ్బందిపై చర్యలు తప్పవని ఆత్మకూరు ఆర్డీఓ పావని హెచ్చరించారు. మండలంలోని గుడినరవలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోళ్లపై సిబ్బంది, రైతులతో మాట్లాడారు. పలువురు రైతులు కొనుగోలు కేంద్రం సిబ్బందిపై ఫిర్యాదు చేయగా వారిపై ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అందుబాటులో ఉండాలని, గోనె సంచులు అందుబాటులో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. రైతులకు కొనుగోలు కేంద్రాలపై అవగాహన కల్పించి వారు దళారుల చేతిలో మోసపోకుండా ఇక్కడే ధాన్యం విక్రయించుకునేలా చైతన్యపర్చాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. తాను మళ్లీ కేంద్రాన్ని తనిఖీ చేస్తానని, రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినా, ధాన్యం కొనుగోళ్లలో ప్రగతి కన్పించకపోయినా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఉదయగిరి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మోచీ కులస్తులు తమకు కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలని ఆర్డీఓను కోరారు. స్పందించిన ఆర్డీఓ ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తొలుత ఆమె గన్నేపల్లిలో చేపట్టిన రీసర్వేను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్ర, రీసర్వే డీటీ జమీర్, సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి, సీఈఓ పోలయ్య, సర్వేయరు శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థపై అవగాహన



కొండాపురంలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకట్రావు



ఉదయగిరిలో ఎఫ్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఇంద్రసేనారెడ్డి

ఉదయగిరి/కొండాపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయగిరి, కొండాపురం పోలీసు స్టేషన్‌లలో ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉదయగిరిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు పోలీసు వ్యవస్థ పనితీరు, చట్టాలపై ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి అవగాహన కల్పించారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. అన్యాయం జరిగితే నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి న్యాయం పొందవచ్చని తెలిపారు. అలాగే కొండాపురంలో కస్తూర్బాగాంధీ విద్యాలయం విద్యార్థినులకు ఎస్సై వెంకట్రావు పోలీసు వ్యవస్థ పనితీరు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఆకతాయిలు, అల్లరిమూకలు ఇబ్బందిపెడితే వారి నుంచి ఎలా రక్షణ పొందాలో తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అ‘పూర్వ’ కలయిక



ఉదయగిరి: 44 ఏళ్ల క్రితం బీఈడీ చదివిన పూర్వ విద్యార్థులు ఒకరినొకరు కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ ఘటనకు నెల్లూరు వేదికైంది. తిరుపతి జిల్లా కోట మండలం విద్యానగర్‌లోని బీఈడీ కళాశాలకు చెందిన 1979–80 బ్యాచ్ విద్యార్థులు వివిధ ఉద్యోగాలు చేసి ఉద్యోగ విరమణ పొంది శేష జీవితం గడుపుతున్నారు. గురువారం వారందరూ ఒకరినొకరు కలుసుకుని ఉల్లాసంగా గడిపారు. అందులో ఉదయగిరి విశ్రాంత ఎంఈఓ, ప్రస్తుత మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గానుగపెంట ఓబులరెడ్డి ఉన్నారు. గత ఆరేళ్లుగా ఏటా కలుసుకుంటూ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.

చదువుల కోవెలకు మరక



కావలిలోని వీఎస్‌యూ కళాశాల

కావలి: కావలిలోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం కళాశాలలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై విద్యార్థులు విస్తుపోతున్నారు. జువాలజీ డిపార్ట్‌మెంట్‌లో ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నడుమ నెలకొన్న రగడ హద్దులు మీరి విద్యార్థులందరికీ చుట్టుకునే పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు, మిగిలిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సిబ్బంది ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తారా అని తలలు పట్టుకుంటున్నారు. అనుచిత ప్రవర్తన కావడంతో లిఖిత పూర్వకంగా, సాక్ష్యాలతో ఇప్పటి వరకు ఎవరూ బయటకు రాలేదు. దీనివల్లనే ఈ వివాదంలో కేంద్రబిందువుగా ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ తనకు ఏమీ కాదని, తనను ఎవరూ ఏమీ చేయలేరనే ధీమాతో ఉన్నారని చెబుతున్నారు. బాధితురాలిగా ప్రచారంలో ఉన్న అసిస్టెంట్ ప్రొఫెసర్ నిస్సహాయురాలు కావడంతో మిగిలిన వారు కూడా తమ పరిస్థితి ఏమిటని కలత చెందుతున్నారు. 2012 నుంచి వివాదాస్పదమైన అసిస్టెంట్ ప్రొఫెసర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నప్పటికీ, ఎప్పుడూ కూడా అతని వ్యవహారశైలిపై విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడానికి ధైర్యం చేయలేకపోయారని చెబుతున్నారు.

త్రీమెన్ కమిటీతో విచారణ

నేను ఇటీవలే ప్రిన్సిపల్‌గా బాధ్యతలు తీసుకున్నాను. నా దృష్టికి వచ్చిన అంశాలను వర్సిటీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. ముగ్గురు అధికారులతో కమిటీని వేశారు. కమిటీ సభ్యులు కళాశాలకు వచ్చి సమగ్ర విచారణ జరిపి నివేదికను అందజేయనున్నారు. దాన్ని ప్రాతిపదికగా చేసుకుని వర్సిటీ అధికారులు తదుపరి చర్యలు తీసుకుంటారు.

–టీ.వీరారెడ్డి, ప్రిన్సిపల్, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం కళాశాల, కావలి